పర్యావరణ పరిరక్షణకు కలిసి పనిచేద్దాం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈనెల5న గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్లో క్లాత్ బాగ్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతీ ఒక్కరు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి, జీవులకు చాలా హానికరమైనదని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తొలగించదానికి అందరం కలిసి పని చేయాలన్నారు. ప్లాస్టిక్ రక్కసి నుండి పార్వతీపురం మన్యం జిల్లాకు సంపూర్ణంగా విముక్తి కలిగిద్దామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రకృతికి హాని కలుగుతుందని అన్నారు. పశువులు, పక్షులు, జలచరాలు ప్లాస్టిక్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చూస్తున్నామని, ప్లాస్టిక్ వాడకం నుండి ఎంత దూరంగా ఉంటే మన ఆరోగ్యాలకు అంత మంచిదని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఉన్న ప్రదేశంలో మొక్కలు మొలకెత్తవని తెలిపారు. భూసారం దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాల కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

5న పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న వనం మనం కార్యక్రమంను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండల ప్రత్యేక అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో గురువారం పాల్గొనాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ కరుణ శ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలు అమలు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని సోమవారం సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సింహాచలం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పరిపాలన చేపట్టి దాదాపు ఏడది కావస్తుందని, నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను తక్షణమే అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డిఈఓను నియమించాలి

విశాలాంధ్ర -బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యా శాఖ అధికారి(డిఈఓ) ను నియమించాలని, డెప్యూటేషన్ పై డిఈఓ ఆఫీస్ లో పనిచేస్తున్న ఎస్టీటీ శంకర్రావును తిరిగి పాఠశాలకు పంపించాలని, ఇన్ఛార్జ్ డిఈఓ గా నియమించబడిన ఎంఈఓను వెనక్కి పంపించాలని పలువురు గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు బి. రవికుమార్, వంగల దాలినాయుడు, పి. సంగం, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్ లు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా మూడు సార్లు పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం వచ్చిన జిల్లాకు రెగ్యులర్ డిఈఓ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. గతంలో ఐటిడిఎలో డెప్యూటేషన్ పై పనిచేసి సస్పెండ్ అయిన ఎస్టీటీ శంకర్రావును డిఈఓ ఆఫీస్ కు వేసిన డెప్యూటేషన్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అలాగే ఒక ఎంఈఓను ఇన్ఛార్జ్ డిఈఓగా నియమించడం సరైంది కాదని తక్షణమే ఆ నియామకం రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

అగ్ని ప్రమాదంలో పూరి గుడిసెలు దగ్ధం

విశాలాంధ్ర-పార్వతీ పురం రూరల్: మండలంలోని తాళ్ల బురిడీ గ్రామ ప్రధాన రహదారి పక్కన అగ్ని ప్రమాదం సంభ వించింది. సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. ఇందులో గ్రామానికి చెందిన కండైన శ్రీను ,వై లక్ష్మీ నాయుడు, సువాన రాము, లక్ష్మీల పూరి గుడిసెలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రాణ నష్టం జరగపోయినప్పటికీ ఆస్తి నష్టం మాత్రం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. అయితే ప్రమాదం జరగడానికి కారణంగా షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఒకసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో గమనిం చిన స్థానికులు వాటిని అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయి, అగ్ని సెకటాలు అలా వ్యాపించి పక్కపక్కనే ఉన్న ఐదులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు జడ్పిటిసి బలగ రేవతి బాధితులు పరామర్శించి ఓదార్చారు. అగ్ని ప్రమాదం మూలంగా నివసించేందుకు నీడ లేకుండా పోయామని బాధితులు లబోదిబో అంటున్నారు .అలాగే ఇంట్లో వస్తువులు అగ్నికి కాళీ బూడిద అయిపోయాయని వారు కన్నీరు మున్నీరవుతున్నారు.

మన్యంలో యోగాంధ్ర



విశాలాంధ్ర-సీతంపేట: సీతంపేట లోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు గేటు వద్ద ఐటిడిఎ అధికారులు మరియు వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది అందరూ కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా విశిష్టతను అందరికీ తెలియజేశారు.యోగ తో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు, డిడి అన్నదొర ఈఈ రమాదేవి, ఎంపీడీవో,ఎస్ఐ అమ్మానరావు, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో జరుగుతున్న జాతరలో ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ అమ్మవార్లను కలెక్టర్ శ్యాంప్రసాద్ దర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా పట్టణములో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యువత సహకరించాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక సౌకర్యాలైన త్రాగునీరు పారిశుధ్యం విద్యుత్తులకు ఇబ్బంది కలుగకుండా అధికారులను ఇప్పటికే ఆదేశించడం జరిగిందన్నారు. మున్సిపల్ రెవెన్యూ విద్యుత్తు శాఖ అధికారులు 24 గంటల పాటు సేవలు అందించడంలో నిమగ్నమై ఉండాలన్నారు. కలెక్టర్ కు ఆలయ కమిటీ సభ్యులు కండువా వేసి గౌరవ పూర్వకంగా ఆహ్వానించారు.

కలెక్టర్‌కి పార్వతీపురం మన్యం జిల్లా వారికి గ్రీవెన్స్ లో వినతి

విశాలాంధ్ర-బలిజిపేట: నారాయణపురం బ్రిడ్జి ప్రారంభించి పాత పద్ధతి లో పార్వతీ పురం నుండి - గౌరిపురం బస్సును పునరుద్ధరించి బలిజి పేట వరకు నడపాలి, నారాయణపురం వద్దబైపాస్ రోడ్డు నిర్మించాలని సిపిఎం వినతి, వెంటనే స్పందించిన కలెక్టర్ గారు ఆర్టీసీ పంచాయతీరాజ్ అధికారులకు 10 రోజుల్లో సమస్య పరిష్కరించాలని బస్సు నడపాలని ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వం కోట్లు నిదులు ఖర్చు చేసి నారాయణపురం వద్ద సువర్ణ ముఖి నదిపై బ్రిడ్జినిర్మాణ పనులు గత 2 సం. క్రితం పూర్తి అయినాయి గత వైసిపి ప్రభుత్వం- ఇప్పుడున్న కూటమి ప్రభుంత్వాం బ్రిడ్జిని ప్రారంభించ లేదు ఇది ఈ ప్రాంత ప్రజల పై నిర్లక్ష్యానికి నిదర్శనం తమరు వెంటనే కలుగజేసుకుని బ్రిడ్జిని ప్రారంభించాలని. మన్యం జిల్లాకేంద్రం పార్వతిపురం నుండి బలిజిపేట వరకు బస్సు నడపాలని గతంలో తిప్పిన గౌరిపురం బస్సు వెంటనే పునరుద్దరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి సిపిఎం పార్టీగా డిమాండ్ చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు రెడ్డి వేణు, బలిజిపేట మండల కార్యదర్శి యమ్మల మన్మధరావు సిపిఎం నాయకులు రామారావు కలెక్టర్ గారిని కలిసిన వాళ్ళు కలెక్టర్ గారి ఆదేశా లని ఆర్టీసీ పంచాయతీ రాజ్ వారు వెంటనే అమలు చేయాలని లేనిచో ఆందోళన చేయడం జరుగుతుంది తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన పార్వతీపురం ఏఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం: ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన ఆధ్వర్యంలో సోమవారంనాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి నలుగురు ఫిర్యాదుదారులు రాగా అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని,తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపవలెనని తెలిపారు.ఈకార్యక్రమంలో ఏఎస్పీతో పాటు డిసిఆర్బీ సిఐ ఆదామ్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే ఇంద్రియ నిగ్రహం

ఐటిడిఏ పీఓ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ్



విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం: యోగాతోనే ఇంద్రియాలను మన ఆధీనంలో ఉంచుకోవచ్చని పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిఓ మాట్లాడుతూ యోగా కార్యక్రమానికి అధికారులు, మహిళలు, యువత పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 20 వరకూ యోగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా అంటే ఒక రోజు చేసి మానేసేది కాదని, నిరంతరం చేసే విద్య అని పేర్కొన్నారు. ప్రతీ రోజూ కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో చేయాలని సూచించారు. యోగా మన సమగ్ర జీవన విధానమని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన సాధనమని తెలిపారు. యోగా కొన్ని భంగిమలు కాదని, మన శరీరానికి, మనసుకు, మన జీవనానికి సమగ్ర గురువని అన్నారు. యోగా ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. ఈకార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారి ఏ మురళిధర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి దుర్గా ప్రసాద్, డిఆర్డిఎ సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై సత్యం నాయుడు, గిరిజన సంక్షేమ అధికారి కృష్ణ వేణి, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో: మండలంలో అన్ని సచివాల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వర్మలు తెలిపారు. ఈనెల 20 వరకు కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా జరగడంతోపాటు యోగాంధ్రలో పాల్గొనే వారి పేర్లను కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. యోగాతో మంచి ఆరోగ్యం వస్తుందని, అన్ని వర్గాల వారు యోగాను చేసే విధంగా ప్రభుత్వం నెలరోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ చేస్తున్నట్లు మండల ఆయుర్వేద వైద్యాధికారి తెర్లి హేమాక్షి, సీతానగరం వైద్యులు ఉషారాణి తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



విశాలాంధ్ర-సాలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ, వారి కోసం ఎన్నో పథకాలు చేపడుతోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం ఉదయం వైటిసిలో సాలూరు ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన పాల పొడి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాహార లోపం లేకుండా, ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం పాల పొడిని అందిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, పిల్లలకు పలు రకాల పౌష్టికాహార కిట్లను అందిస్తుండగా, పాల పొడి పంపిణీని సైతం ప్రారంభించిందన్నారు. ఆ మేరకు మొదట సాలూరు, పాచిపెంట, రంప చోడవరం, అనంతగిరి వంటి గిరిజన ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, తదుపరి ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందన్నారు. ఇది మాతా, శిశువుల సంరక్షణకు బాగా తోడ్పడుతుం దన్నారు. కావున ఐసిడిఎస్ ఉద్యోగులు, అంగన్వాడి కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరిం చాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలకు కిట్లను అందజేసారు. అదేవిధంగా వైటిసిలో ఉన్న గర్భిణీలను కలిసి మాట్లాడుతూ, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎటువంటి సమస్య ఎదురైనా చెప్పాలన్నారు. తదుపరి వారికి ఘనంగా సీమంతాలు నిర్వహించారు. కార్యక్ర మంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేశ్, ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, ఐసిడిఎస్ పి.డి కనక దుర్గ, ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, సాలూరు, పాచిపెంట సిడిపిఓలు విజయ లక్ష్మి, అనంత లక్ష్మి, వైటిసి కో-ఆర్డినేటర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్తుపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ విద్యుత్తుపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఐటిడి ఏ పి ఓలు, ట్రాన్స్కో, గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, ఎంపిడి ఓలు, తాహశీల్దారులతో పీ ఎం సూర్య ఘర్ సోలార్ విద్యుత్తు ప్యానెల్స్ ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం వలన విద్యుత్తు పోతుందనే టెన్షన్ ఉండదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు సోలార్ ప్యానెల్సుకు అర్హులన్నారు. ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి స్థలం ఉన్న ప్రతీ ఒక్కరూ పి. ఎం. సూర్య ఘర్ పథకానికి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడి ఏ పి ఓలు డా. ఎం. జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..

ఒకే రోజు 2 లక్షల మొక్కలు

పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఈనెల 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకేరోజు రెండు లక్షల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమం వనం-మనం కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ థీమ్ "ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి"కి అనుగుణంగా, చర్యలు తీసుకోవాలని డివిజనల్ అటవీ అధికారి పి.వి. సందీప్ రెడ్డిని ఆదేశించారు. అటవీ శాఖ తరఫున 1,00,000 మొక్కలు నాటాలని, అదే విధంగా అటవీ అభివృద్ధి సంస్థ 50 వేల మొక్కలు, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, డ్వామా సంయుక్తంగా 50 వేల మొక్కలు నాటాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆయా విభాగాలు ప్రాథమిక లక్ష్యాన్ని దాటి ముందుకు సాగాలనిమరియు రాబోయే మూడు రోజుల్లో, 4 లక్షల మొక్కలను నాటడానికి ప్రయత్నించాలని కలెక్టర్ కోరారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండల రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులు వారి వారి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డులు రైతు సేవ కేంద్రాలకు తీసుకువెళ్లి 90 శాతం రాయితీపై వరి విత్తనాలు తీసుకోవాలని ఆమె చెప్పారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

22 కేజీల గంజాయి పట్టివేత, ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర-చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఎడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు చింతూరు తెల్లం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చింతూరు ఎస్సై పి రమేష్ పోలీస్ స్టేషన్ నందు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీపై ఒరిస్సా నుండి తరలిస్తుండగా 22 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన చింతల దుర్గాప్రసాద్,పిల్లి లీలా కృష్ణ లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ లక్ష పదివేల రూపాయలు విలువ ఉంటుందని తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తులు వద్ద మొబైల్ ఫోన్లు రెండు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు యస్. ఐ తెలిపారు. చింతూరు ఎమ్మార్వో చిరంజీవి బాబు, వీఆర్వో ధారబాబు ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం రంపచోడవరం లోని కోర్టులో హాజరపరచనున్నట్లు తెలిపారు.

జీసీసీ డిపోల ద్వారా రేషన్ పంపిణీ

విశాలాంధ్ర-సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో జీసీసీ డిపో ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి వెళ్లి డోర్ డెలివరీ రేషన్ సరఫరాను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి తిరిగి జీసీసీ ఆధ్వర్యంలో డిపో సేల్స్ మేన్‌ల ద్వారా రేషన్ పంపిణీ పునరుద్దరించడంతో ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నడిగొట్ల రాజు మాట్లాడుతూ ప్రతీ నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతురాజు, కృష్ణ, స్థానిక వీఆర్వో ముర్ల సత్యనారాయణ, సేల్స్‌మేన్ నైని నరసింగరావు, కూటమి నాయకులు కొప్పొజు కాశి, కుప్పా సన్యాసిరావు, కిలో భగవాన్, చంద్రరావు, జీ.ఫిలోన్, బందారు మారిబాబు, శ్రీనివాస్, లోలుగుల రాధా, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-చింతపల్లి: ప్రజా సమ స్యల పరిష్కార నిమిత్తం ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లబ్ధిదారులు దరఖాస్తు సమర్పించినట్లు చింతపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి యుఎస్ వి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం లో ప్రతి సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు "మీకోసం" కార్యక్రమం నిర్వహించుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారని అన్నారు. రెవెన్యూ శాఖ కు సంబంధించిన దరఖాస్తులు కూడా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు అనుభవించే అవకాశం ఆదివాసీలకు లేదా

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

విశాలాంధ్ర-చింతపల్లి: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగం తమకు కల్పించిన చట్టాలు, హక్కులు అనుభవించే అవకాశం తమకు ఉందో, లేదో ప్రభుత్వాలు, న్యాయస్థానాలు చెప్పాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. గత నెల 31న శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో ప్రారంభించిన జీపు జాత అల్లూరి జిల్లా చింతపల్లి మండల కేంద్రానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా పాత బస్టాండ్ లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు, హక్కులు ఉన్నప్పటికీ, వాటి ద్వారా సంక్రమించే ఉద్యోగాలు తమకు లేకుండా చేశారని, ఆదివాసి ప్రాంతంలో ఉన్న తాము ఆదివాసి గిరిజనులమో, కాదో ప్రభుత్వాలు న్యాయస్థానాలు చెబితే బాగుంటుందని, పరిపాలిస్తున్న ప్రభుత్వాలపైన. తీర్పులిస్తున్న న్యాయస్థానాల పై ఆయన మండిపడ్డారు. గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి, 100% ఉద్యోగాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 3 రద్దు చేసినప్పటి నుంచి గిరిజనుల పక్షాన ఆదివాసి గిరిజన సంఘం ప్రభుత్వాలపైన బలమైన పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శిం చారు. ఏజెన్సీలో బంద్ లు కూడా చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, అల్లూరి జిల్లా అరకువేలి సభలో వచ్చి జీవన భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారని, అయినా రాష్ట్రవ్యాప్తంగా తీసుకున్న జనరల్ డీఎస్సీ తప్ప జీవో నెంబర్ 3 కి చట్టబద్ధత లేదని, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ రాలేదని ఆరోపించారు, అనంతరం ఆదివాసి ట్రస్టులో డబ్బులు కట్టి మోసపోయిన బాధితులు కిల్లో సురేంద్ర కి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. ఆదివాసి ట్రస్ట్ బాదితులు చిక్కుడు అశోక్ వండలం బాలయ్య. కృష్ణ, చింతపల్లిలో రహదారి విస్తరణలో భాగంగా దుకాణాలు గృహాలు కోల్పోతున్న ఆదివాసి గిరిజనులు మరో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్. చింతపల్లి, జికే వీధి మండలాల ఆదివాసి గిరిజన సంఘం నాయకులు. పాంగి ధనుంజయ్, పాంగి బాలయ్య. సాగిన చిరంజీవి. తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్న నిరుద్యోగ యువతకు ప్రత్యామ్నాయం చూపండి

ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత



విశాలాంధ్ర-చింతపల్లి: ఉపాధి కోల్పోతున్న నిరుద్యోగ గిరిజన యువతకు ప్రత్యామ్నాయం చూపాలని ఎంపీపీ కోరాబు అనుష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, వైకాపా మండల అధ్యక్షుడు పాంగి గణబాబు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ రహదారి విస్తరణ, అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియను తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఉపాధి కోలతున్న నిరుద్యోగ గిరిజన యువతకు ప్రత్యామ్నాయం చూపవలసిన అవసరం అధికారులపై ఉందన్నారు. ఇప్పటికే జీవో నెంబర్ 3 రద్దు కావడం వలన మన్య ప్రాంతంలో గిరిజన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. అలా నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది గిరిజనులు ఉపాధి అవకాశాల పేరిట బడ్డీలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారన్నారు. రహదారి విస్తరణ పేరిట న్యాయస్థానాల ఉత్తర్వుల మేరకు రహదారిలో భవనముల శాఖ కు చెందిన ప్రభుత్వ స్థలాలలో ఉన్న బడ్డీలను అదే క్రమంలో రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణ సముదాలను తొలగించడం వలన అనేక మంది ఉపాధి కోల్పోతున్నారన్నారు. వారిలో నిరుద్యోగ యువత కూడా ఉందని అలా ఉపాధి అవకాశాలు కోల్పోయిన గిరిజన నిరుద్యోగ యువతకు ప్రత్యామ్నాయం చూపాలని ఈ సందర్భంగా వారు పాలకులు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏసిబి కి చిక్కిన సబ్ ట్రెజరి అధికారులు



విశాలాంధ్ర-చింతూరు : చింతూరు లోని సబ్ ట్రెజరి కార్యాలయం పై ఎ సి బి అధికారులు పథకం ప్రకారం దాడి చేసి ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసినట్లు డి యస్ పి.నాగేశ్వరావు తెలిపారు. నర్సింహా పురం ఆశ్రమ పాఠశాలలో వార్డెన్ గా పనిచేస్తున్న ఫకీర్ దొర కు పెండింగ్ లో వున్న బిల్లులు పాస్ చేయడం కోసం 2లక్షలు డిమాండ్ చేశారు.అంత ఇచ్చు కోలేనని చెప్పినా 2సార్లు రిజక్ట్ చేశారు. లంచం కోసం డిమాండ్ చేసిన ట్రెజరి ఆఫీసర్ వంశీ కళ్యాణ్, సమ్మయేల్ సోమవారం అరెస్ట్ చేశారు. నిందితులను మంగళవారం రాజమండ్రి కోర్ట్ లో హాజరు పరుస్తామని తెలిపారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం

- కూటమి మోసల్ని ఎండగట్టేందుకు భారీ నిరసన ర్యాలీ
- 4న వెన్నుపోటు దినం పేరుతో పాడేరు నియోజకవర్గంలో భారీ ర్యాలీ
- ప్రజలతో కలిసి అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చిన వైసీపీ జిల్లా అధ్యక్షులు
- మాడుగులలో పార్టీశ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ



విశాలాంధ్ర-జీ మాడుగుల : పాడేరు నియోజకవర్గంలో జూన్ 4వ తేదీన వైయస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగనన్న తలపెట్టిన "వెన్నుపోటు దినం" కార్యక్రమన్ని విజయవంతం చెయ్యాలని పిలుపు నిస్తూ, వెన్నుపోటు దినం పోస్టరు ను, పార్టీ శ్రేణులతో కలిసి జీ మాడుగుల మండల కేంద్రంలో వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు నర్మని మాత్స్యకొండం నాయుడు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగో తేదీన ప్రజల మద్దతు తో జరిగే ఈ నిరసన ర్యాలీను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేనా కూటమి ప్రభుత్వము. అధికారంలోకి వచ్చి 365 రోజులుపూర్తవుతున్న ఇప్పటికీ ఒక్క హామీ నెరవేర్చని ఈ కూటమి ప్రభుత్వం! 2024 జూన్ 4న అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ తో పాటు మరో 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏడాది గడిచిన ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని అన్నారు. ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజల్ని మభ్యపెట్టి , గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజల్ని " వెన్నుపోటు" పొడిచిన చంద్రబాబు ప్రభుత్వం, మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైయస్ జగన్మోహన్ రెడ్డి , ఇచ్చిన పిలుపు మేరకు జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు, ఇప్పుడున్న కాలం లోఎవరికి ఏ ప్రభుత్వ శాశ్వతం కాదని.? ప్రజల తీర్పే శాశ్వతమన్నారు. వెన్నుపోటు దినం ప్రజా గళానికి వేదికనీ, జూన్ 4న జగనన్న వెన్నుపోటు దినం , కేవలం నిరసన కార్యక్రమం కాదని, అది హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రజా గళం,అని పేర్కొన్నారు. హామీలు అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి లక్ష్యంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. పాడేరు నియోజకవర్గ పరిధిలో గల ఐదు మండలాలకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, నాయకులు, కార్యకర్తలు, ప్రజల స్వచ్ఛందంగా కదిలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు గబ్బడి శేఖర్, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వంజరి సీతారాం నాయుడు ,ఎంపీటీసీ మాత్స్యరాస విజయ కుమారి, జిమాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, పండన్న ,బాలు, మురళి, కుమారి తదితరుల పాల్గొన్నారు.

అమ్మవార్ల పండుగకు సిఎంఆర్ 4 లక్షల విరాళం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో మూడేళ్ల తర్వాత అత్యంత వైభవంగా జరుపుకోనున్న ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ పండుగల సందర్భంగా ప్రముఖ వ్యాపార సంస్థ సీఎంఆర్ యాజమాన్యం 4 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర తెలియజేశారు. ఆ సంస్థ ప్రతినిధులు ఆ మొత్తాన్ని అందించగా, కమిటీ ప్రతినిధులకు అందజేసినట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ అమ్మవార్ల పట్ల సీఎంఆర్ యాజమాన్యానికి గల భక్తికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. జూన్ 1, 2,3 తేదీలలో అమ్మవార్ల పండుగలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రేషన్ డిపోల ద్వారా సక్రమంగా సరుకులు పంపిణీ



విశాలాంధ్ర-సీతానగరం: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ మండలంలో సక్రమంగా జరుగుతుందని తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలో 39రేషన్ డిపోలు నడుస్తున్నాయని, ఈనెల ఒకటి నుంచి వినియో గదారులకు రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేయడంలో అధికారులు పర్యవేక్షణ కూడా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో డీలర్లు ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8గంటల వరకు సరుకులు అందజేయాలన్నారు. అందరికీ సరుకులు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని, దీనిపై ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇదిలాఉండగా అర్హులైన కౌలు రైతులకు సీసీ కార్డులను కూడా అందజేస్తున్నామని, కౌలు రైతులు గ్రామాల్లో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో అర్హులైన వారు ఇళ్లపట్టాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్ లో వచ్చిన రెవెన్యూ సమస్యలను కూడా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

యోగాంధ్రలో ముగ్గులు పోటీలు

విశాలాంధ్ర-బలిజిపేట: యోగాంధ్రలో ముగ్గులు పోటీలు కార్యక్రమంలో భాగంగా సోమవారము ఐసిడిఎస్ పిఓ సులేఖ పరివేక్షణ భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రాంగణంలో అంగన్వాడీ కార్యకర్తలతో ముగ్గుల పోటీలు కార్యక్రమమును నిర్వహించారు ఈ సందర్భంగా ఐసిడిఎస్పిఓ సులేఖ మాట్లాడుతూ సోమవారం ముగ్గులపోటీలు కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఇది సంస్కృతి సంప్రదాయం పరిరక్షణకు ఇలాంటి ముగ్గుల పోటీలు ఉపకరిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్ ఎంపీడీవో నగేష్ సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కిరణ్మయి, సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని సమ్మర్ విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ శాఖ అధికారిని శెట్టి. సునీత ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు, చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, చిన్నారులకు ముగింపు రోజున బహుమతులు ప్రధానం చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ శాఖ సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రాలో రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర-పార్వతీపురం: యోగాంధ్రా కార్యక్రమంలో భాగం గా సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఐసీడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.టి. కనక దుర్గ పర్యవేక్షణలో స్థానిక ఆర్ సి యం ప్రాంగణంలో మహిళలతో రంగవల్లి (ముగ్గుల పోటీలు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగవల్లుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో శిశు గృహ, బాల సదనం, మహిళా శిశు సంక్షేమ శాఖ, వన్ స్టాప్ సెంటర్ మహిళలు, పలు శాఖల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

గిరి రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

90% రాయితీపై విత్తనాలు అందించడం అభినందనీయం

లంబసింగి ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి

విశాలాంధ్ర-చింతపల్లి: 90శాతం రాయితీపై పంపిణీ చేసే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని లంబసింగి ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి అన్నారు. మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం లమ్మసింగి గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలోని కూటమి పార్టీలకు చెందిన నాయకులు హాజరైన ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 90% రాయితీ పై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 90 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసికొని నేల సారాన్ని పెంచుకొని నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో లంబసింగి పంచాయతీ కార్యదర్శి పి అప్పలరాజు, కూటమి పార్టీలకు చెందిన జనసేన, బిజెపి పార్టీల మండల అధ్యక్షులు బుజ్జిబాబు, బాలకృష్ణ, కూటమి నాయకులు, ఉద్యాన సహాయకులు ఎస్ కైలాష్ , అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల బృందం బలిజిపేట సందర్శన

విశాలాంధ్ర-బలిజిపేట: విక్షిత్ కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా శాస్త్రవేత్తల బృందం బలిజిపేట మండలంలో మూడు గ్రామాల్లో గంగాడ, బర్లి, వంతరం గ్రామాల్లో సందర్శించారు. ఈ కార్యక్రమంలో వరి ప్రత్యామ్నకంగా నీటి సదుపాయం గల మెట్ట భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని శ్రీనివాస్ రాజు, సైంటిస్ట్, జాతీయ జీవాల మిషన్ లో భాగంగా 50% సబ్సిడీ వినియోగించుకోవాలి అని విష్ణువర్ధన్ రెడ్డి సైంటిస్టు చెప్పారు, మట్టి పరీక్షల ద్వారా ఎరువుల వేయాలని, భూసారాన్ని పెంచడం కోసం పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని బిందు, సైంటిస్ట్, అధిక రాబడులు కోసం రైతులు సంప్రదాయేతర వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని వెంకటేశ్వరావు సైంటిస్ట్, మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన చర్యలు తేజస్వరావు సైంటిస్ట్, వరి పంట సాగులో తీసుకోవాల్సిన చర్యలు ఎంవీ శ్రీనివాస్ సైంటిస్టు, పంట మార్పిడి గురించి శ్రీనివాస్, డీఆర్సీ, సహాయ వ్యవసాయ సంచాలకులు, పార్వతీపురం, భూమిలో సేంద్రీయ కార్బన్ తగ్గిందని దీనిని పెంచుకోవాలని పెంచడానికి పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాలు వేసుకోవాలని తెలియజేయడం జరిగిందని టి వెంకటేశు , సహాయ వ్యవసాయ సంచాలకులు, పార్వతీపురం సబ్ డివిజన్ చెప్పడం జరిగింది. పామ్ ఆయిల్ సాగు విధానాన్ని ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి

ఎర్రబొమ్మలు సర్పంచ్ పండయ్య

విశాలాంధ్ర-చింతపల్లి: మండలంలోని రోలంగి గ్రామంలో ఏర్పాటు చేసిన బి ఎస్ ఎన్ ఎల్ సెల్ టవర్ ద్వారా సెల్ సేవలను సెల్ వినియోగదారులకు అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎర్రబొమ్మలు సర్పంచ్ లోతా పండయ్య అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను అధికారులు ఏర్పాటు చేశారన్నారు. ఇందులో భాగంగా పంచాయతీలోని సాడిక, పారికలు పెద్దూరు, రోలంగి, సీతారాంపురం కొండ వంచుల, తప్పలమామిడి, జెర్రగెడ్డ తదితర గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ టవర్ లు ఏర్పాటుచేశారన్నారు. అయితే టవర్ లు ఏర్పాటు చేసి మూడేళ్లు కావస్తున్నా బిఎస్ఎన్ఎల్ టవర్ ద్వారా సెల్ సంకేతాలు మాత్రం అందుబాటులో లేవన్నారు. దీంతో బిఎస్ఎన్ఎల్ రీఛార్జ్ చేయించుకున్నప్పటికీ, ఉపయోగ పడటం లేదన్నారు. సెల్ సంకేతాలు లేకపోవడంతో పంచాయతీ కార్యాలయం (సచివాలయం ద్వారా) ద్వారా అందవలసిన సేవలను పంచాయతీ పరిధిలోని సెల్ వినియోగదారులు పొందలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేం దుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పేదలకు, అనాధలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి

ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డా.జగన్ మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం: ఆర్.బి.ఎస్.కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సోమవారం ఆయన తన పుట్టినరోజు సందర్భంగా అందుబాటులో ఉన్న అనాధలకు నిత్యావసర వస్తు రూపంలో చేసే దానం కొంతలో కొంత ఆదుకుంటుందని సదుద్దేశంతో పార్వతీపురం మునిసిపల్ కొత్తవలస శివారున గల ఆశాజ్యోతి ఆశ్రమానికి స్టీల్ వాటర్ బాటిళ్లు, నిత్యావసర సరుకులు రిఫండ్ ఆయిల్, కందిపప్పు, పండ్లు అందజేశారు. అక్కడ చిన్నారులకు పండ్లు పంచి పెట్టి వారితో కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ తండ్రి వృత్తిరీత్యా కుష్టు రోగులకు 25 సంవత్సరాలు సేవలందించారని వృత్తిలో ఉండగానే స్వర్గస్తులయ్యారని అన్నారు. వృత్తిలో సేవా భావంలో ఆయన మాకెంతో స్ఫూర్తిదాయక మని అన్నారు. పేదలకు, అనాధాలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. అనంతరం అక్కడి పిల్లలకు ఆరోగ్య పరిశీలన చేసి తగు సూచనలు చేసి, రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు డాక్టర్ జగన్మోహన్ రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆశాజ్యోతి ఆశ్రమ ఇంచార్జి ఎస్. లలిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది సన్యాసిరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ లో ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలతలతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.63 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదిదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, పునఃపరిశీలన లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, డ్వామా పిడి కె. రామచంద్ర రావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, ఉద్యానవన శాఖ అధికారి బి.శ్యామల, పశు సంవర్ధక శాఖఅధికారిడా.ఎస్.మన్మధరావు, డిఆర్డి ఏ.పిడి ఎమ్.సుధారాణి, ఐసీడీఎస్ పిడి డా.టి.కనక దుర్గ డిఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి మాజీ వైస్ఎంపీపీ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా లాభసాటి చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంచేయగా పశువులకు సంబంధించి పౌష్టికాహారమైన దానాలు 50% రాయితీపై పంపిణీ చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని మండల వైస్ ఎంపీపీ గొట్టపు వెంకటరమణ అన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకుని, పాడి సంపదను మరింత పెంపొం దించాలని సూచించారు. మండలంలో నర్సిపురం గ్రామంలో ప్రభుత్వం 50% రాయితీపై అందిస్తున్న పశువుల దానాలను సోమవారం అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. పశు వైద్య కేంద్రం వద్ద రైతులకు అందించారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపడుతుందని రైతులందరికీ మంచి రోజులు వచ్చాయని అన్నారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర రైతులకు అండగా ఉంటూ ప్రభుత్వం తరపున రైతులకు అందాల్సిన లబ్ధిని అందిస్తూ గ్రామంలో ప్రతి ఒక్క సమస్యను తీరుస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ళు ఢీకొని వ్యక్తి మృతి

ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : ఎదురెదురుగా మోటార్ సైకిళ్ళు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జియ్యమ్మవలస మండలం బాసంగి గదబవలస గ్రామానికి చెందిన చెట్ల సింహాచలం (30) తన అత్తవారిల్లు పార్వతీపురం మండలం కొత్తూరు గ్రామానికి వచ్చాడు. సామానులు కొనడానికి గ్రామానికి చెందిన పాపయ్యతో కలసి మోటార్ సైకిల్ పై పార్వతీపురం వస్తుండగా మరికి గ్రామం దాటిన తరువాత మలుపు వద్ద పార్వతీపురం నుండి మోటార్ సైకిల్ పై వస్తున్న కొరియర్ బోయ్ దామోదర రాజు ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ సంఘటనలో సింహాచలంకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తనిఖీ చేసి సింహాచలం అప్పటికే మృతి చెందినట్లు తెలిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పాపయ్య, దామోదర రాజులకు చికిత్స అందించారు. రూరల్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేద్దాం

ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలు పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి: ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేసిన తెదేపా జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన మోసాలు, అరాచకాలు అన్యాయాలపై వైకాపా ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేద్దామని ఎంపీపీ అనూష దేవి జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. వైకాపా మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం లో సుభిక్షంగా ఉన్న సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం మూడు ముక్కలాటగా మార్చిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా వైకాపా ప్రభుత్వంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి సరఫరా చేసిన నిత్యవసర సరుకుల పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ఈ ప్రభుత్వం పూనుకుందన్నారు. దీని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కల్పించారన్నారు. వెన్నుపోటు పొడవడం, మోసాలు, అరాచకాలు, అన్యాయాలు చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి కొత్తేమీ కాదన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఏడాది కావస్తున్నా, వాటిని అమలు అమలు పరచకుండా నమ్మిన ప్రజలను నిలువునా మోసగించారన్నారు. అటువంటి వెన్నుపోటు, మోసపూరిత ఆలోచనలు కలిగిన చంద్రబాబు పాలనకు నిరసనగా వైసిపి పిలుపునిచ్చిన వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్ ను విడుదల చేసి చంద్రబాబు నాయుడు నియంతృత్వ పాలనకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పాలకొండ : జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం కార్యక్రమం వైయస్సార్సీపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాలుగు మండలాల నాయకులు అభిమానులు కార్యకర్తలు హాజరుకావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ మరియు మండల అధ్యక్షులు వెలమల మన్మధరావు కనపాక సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాజీ ఎమ్మెల్యే కళావతి పాల్గొంటారని అన్నారు వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను(వాల్ పోస్టర్)సోమవారం విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన మోసాలను ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఆపసోపాలు పడుతున్నారని ప్రస్తుతం రాష్ట్రంలో ఎర్రబుక్కు రాజ్యాంగం కొనసాగుతుందని వీటన్నింటి పైన నిలదీసి ప్రజాక్షేత్రంలో నిలబెట్టే విధంగా ఎండ కట్టాలని వెల్లడించారు ఈ కార్యక్రమం స్థానిక కార్గిల్ జంక్షన్లో 4వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభించి స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకు ర్యాలీగా కొనసాగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు వీరితో పాటు పాలవలస ధవళేశ్వరరావు లోలుగు విశ్వేశ్వరరావు నెల్లి శివప్రసాద్ తూముల లక్ష్మణరావు దుంపల చిన్ని భానుబాబు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు, గృహాలు కోల్పోతున్న గిరిజనులకు ప్రత్యామ్నాయం చూపండి

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి: గిరిజన చట్టాలు, హక్కులన నుసరించి దుకాణాలు, గృహాలు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నయం చూపించిన తర్వాతనే కాళీ చేయించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు . అల్లూరి జిల్లాలో రహదారుల విస్తరణలో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోనూ రహదారి విస్తరణ చేపట్టారు. ఆర్ అండ్ బి స్థలమైతే 40 మీటర్లు. పంచాయితీ స్థలం అయితే. 30 మీటర్లు ఇప్పుడున్న ప్రధాన రహదారి నుంచి చుట్టుపక్కల ఉన్న దుకాణాలు, గృహాలు ఖాళీ చేయాలని న్యాయస్థానాల ఉత్తర్వులు, ప్రభుత్వ అధికారుల ఆదేశాలతో శనివారం చింతపల్లిలో ప్రధాన రహదారికి ఇరువైపులా నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించడం జరుగుతుందని. సోమవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి ఉప తహసిల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. ఇది ఐదవ షెడ్యూల్ గిరిజన ప్రాంతమని సర్వ అధికారాలు గిరిజన సలహా మండలి సూచనతో రాష్ట్ర గవర్నర్ కి మరియు రాష్ట్రపతికి తప్ప పరిపాలిస్తున్న ప్రభుత్వాలకి గిరిజన చట్టాలు, హక్కులు భూమిపై అధికారం లేదని, గతంలో సమత స్వచ్ఛంద సంస్థ మరియు బిర్లా కంపెనీ మధ్య జరిగిన చర్చలో సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ అని గుర్తు చేశారు. అటువంటప్పుడు ప్రభుత్వం చెప్పిందని, కోర్టు ఆదేశించిందని. ఆదివాసి గిరిజన దుకాణాలు, గృహాలు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇల్లులు భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి ప్రత్యామ్నాయం చూపినప్పుడే తొలగింపులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని చిన్నయ్య పడాల్ కోరారు, లేకపోతే బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆఫీస్ కి వస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన దుకాణాలు, గృహాలు కోల్పోతున్న బాధితులు .వసుపరి హంసరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు రమణ, సాగిన రామరాజు. నరేష్. ఉమా. గంగన్నపడాల్. జల్లి సుధాకర్. మరియు బాధితులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందుతాయి : టీడీపీ

విశాలాంధ్ర-కూనవరం. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అపోహలు అవసరం లేదని ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పథకాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీ పోడియం అప్పారావు తెలిపారు. కూనవరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఈ మేరకు సమావేశమై కొందరు వైసీపీ నాయకులు పనిగట్టుకొని సూపర్ సిక్స్ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అది సరైనది కాదని అన్నారు. పెన్షన్ నాలుగు వేలకు పెంచామని, మెగా డిఎస్సి ప్రకటించామని తల్లికి వందనం ఫ్రీ బస్సు పై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టతనిచ్చిందని అన్నారు. వైకాపా అధికారంలోకి రాకముందు పోలవరం పరిహారం పొందిన ఎకరాకి 115000 ఇచ్చిన భూములకు 5 లక్షలు ఇస్తానన్న హామీ ఏమైంది అని ప్రశ్నించారు. మూడు రాజధానులు అని రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేస్తామని ఏం చేశారో మీకు తెలుసని అలాంటి మీకు సూపర్ సిక్స్ పథకాల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండారు శివయ్య చెలికాని %జఱ%ఉమా ఎడ్ల రాంబాబు గడేసుల ప్రేమ్చంద్ ఎడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సతీమణి అనూష

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని తాళ్ల బురిడీ గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే సతీమణి అనూష మానవతా దృక్పథంతో పరామర్శించి ఓదార్చారు. గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధమైనాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సతీమణి బోనెల అనూష ఘటనాస్థలికి చేరుకొని బాధితులను పరామర్శించారు. అటువైపుగా శుభకార్యం నిమిత్తం ప్రయాణమై వెళ్తున్న అనూషకు తాళ్లబురిడి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన గురించి పార్టీ నాయకులు తెలియజేయడంతో ప్రయాణాన్ని ఆపి బాధితులను పరామర్శించారు. బాధితులను పేరుపేరునా పలకరించి అగ్ని ప్రమాదానికి గల కారణాలను, జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనను ఎమ్మెల్యే విజయచంద్ర దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు హర్షం వెలిబుచ్చారు.

బంగారమ్మ తల్లిపండుగకు ఎమ్మెల్యే విజయచంద్ర సతీమణి అనూష 25వేల విరాళం

విశాలాంధ్ర- పార్వతీ పురం: శ్రీబంగారమ్మ తల్లిపండుగ కోసం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సతీమణి అనూష 25వేల విరాళాన్ని అందజేశారు. సోమవారం సాయంత్రం పండుగ నిర్వాహక కమిటీ సభ్యులకు ఈమొత్తాన్ని ఆమె అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం ప్రజలకు బంగారమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా లభించాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఐటిడిఏ గ్రీవెన్స్ కు 32 వినతులు

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏలో ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించుకున్నారు.చిన్నపొల్ల గ్రామానికి చెందిన గేదెల శ్రీలత తనకు కుట్టుమిషన్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.జమ్మడుగూడ గ్రామానికి చెందిన సవర కళ్యాన్ దోనుబాయి రోడ్డు నుండి జమ్మడుగూడ వరకు రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.పూతికవలసలోని గూడంగి కాలనీకి చెందిన ఊయక సుందరావు ఇంటింటికి కొలాయి ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. సవర కురిడింగి గ్రామానికి చెందిన బొంతు జగన్ మామిడి మరియు జీడి మొక్కలు ఇప్పించాలని వినతి మాత్రం సమర్పించారు.కోడిస గ్రామానికి చెందిన హిమరక రవి 1బి అడంగల్ ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. పద్మాపురం గ్రామానికి చెందిన మనోసింగు దాలు ట్రాక్టర్ లోన్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.పనసలోవ గ్రామానికి చెందిన బెజ్జి కృష్ణారావు కొండపోడు పట్టా మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.కుసిమి గ్రామానికి చెందిన పాలక ఉమా నర్సింగ్ సీటు ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.రేగులగూడ గ్రామానికి చెందిన సవర రామకృష్ణ భాషా విద్యా వాలంటీరుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. సన్నాయి కాలనీ గ్రామానికి చెందిన ఆరిక సీమోను జిపిఎస్ పాఠశాల తిరిగి ఓపెన్ చేసి ఒక ఉపాధ్యాయుని నియమించాలని వినతిపత్రం సమర్పించారు.ఆశోకం గ్రామానికి చెందిన పెద్దింటి భవాని తనకు పెళ్లి కానుక మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్ఓ వెంకట గణేష్, డిప్యూటీ డిఇఓ కుమార్, వెలుగు ఏపీడి, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల కార్యకర్తలే పార్టీకు కీలకం

ఎమ్మెల్యే విజయ్ చంద్ర



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: క్రమశిక్షణ గల ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి ఎంతో కీలకమని, కష్ట కాలాల్లో సైతం పార్టీ మనుగడ కోసం పునాదిల దృఢంగా నిలుస్తారని ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కుప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు జన్మదిన సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. వెంకట్ నాయుడుకు ప్రతి ఒక్కరూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేకు కట్ చేసి ఎమ్మెల్యే విజయ్ చంద్ర చేతులతో మిఠాయి తినిపించారు. సందర్భంగా పార్టీ కోసం వెంకట్ నాయుడు తీసుకుంటున్న చర్యలు కార్యకర్తలతో సంబంధం కలుపుకొని ముందుకు వేస్తున్నా అడుగులను ఎమ్మెల్యే కొనియాడారు. రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి వెంకట నాయుడు కార్యకర్త మాదిరిగానే ఎదిగారు తప్ప ఎక్కడ కూడా పార్టీకి వ్యతిరేకతగా ఒక్క అడుగు కూడా వేయలేదని ఇటువంటి నిబంధత గల నాయకులు తెలుగుదేశం పార్టీలో ఉండడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ వేడుకలకు ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి, గురజాన మౌళి, కార్యకర్తలు నాయకులు హాజరయ్యారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



విశాలాంధ్ర-బెలగాం : గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం పార్వతీపురం రైల్వే స్టేషన్ల మధ్య గుచ్చిమి గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మరిపి అప్పలనాయుడు (33) తన మామిడి తోటకు వెళ్లే క్రమంలో రైల్వే ట్రాక్ ని దాటుతుండగా సీతానగరం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు బండి ప్రమాదవశాత్తుగా ఢీ కొట్టింది. ఈసంఘటనలో అప్పలనాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు సమాచారం అందుకున్న పార్వతీపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పార్వతీపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
సోమవారం 2, జూన్ 2025

మాజీ ఎమ్మెల్యే అలజంగి వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

నిర్వహించిన వైయస్సార్సీపి ప్రజా ప్రతినిధులు, నాయకులు

విశాలాంధ్ర-సీతానగరం:గడిచిన ఏడాది 2024 సాధారణ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి, గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వ యొక్క మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రంలో గల అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 4న వెన్నుపోటు దినం పేరిటనిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. సోమవారం సాయంత్రం సీతానగరంలో ఆయన దీనికి సంబంధించి పోస్టర్లను వైయస్సార్సీపి ప్రజాప్రతినిధులు నాయకులు సమక్షంలో విడుదల చేశారు. పార్వతీపురం నియోజకవర్గం కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైయస్ఆర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించడం జరుగుతుందని , వైసిపి శ్రేణులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తె ా లి ఎ ా ం ా ు . . ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి నడిమింటి రామకృష్ణ, ఎక్స్ జడ్పీటీసీ అంబటి కృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ పోల ఈశ్వరనారాయణ, రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ, విద్యార్థి విభాగం అధ్యక్షులు బి శివ, జిల్లా పార్టీ ప్రతినిదులు ముకుంద, బి శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నియోజకవర్గ మరియు రాష్ట్ర స్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు , పాల్గొన్నారు. ..

350 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు

విశాలాంధ్ర,పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మంగళవారం నాడు జరగనున్న పార్వతీపురం పట్టణ ప్రజల ఆరాధ్య దేవతలు శ్రీఇప్పల పోలమ్మ తల్లి, శ్రీఎర్రకంచెమ్మ తల్లి, శ్రీబంగారమ్మ తల్లిపండుగలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేసామని, 350 మంది పోలీస్ అధికారులతో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. నేటి సాయంత్రం పట్టణంలోని శ్రీఎర్ర కంచమ్మ, శ్రీఇప్పలపోలమ్మ అమ్మ తల్లుల పండుగ సందర్భంగా సిరిమాను రథోత్సవము ఉంటుందందున ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన పర్యవేక్షణలో మందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆధ్వర్యంలో వివిధ కమిటీలు కూడా భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పర్యవేక్షణలో కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా మౌలిక వసతులు వైద్య సదుపాయాలు, తాగునీరు వంటి సేవలను కల్పించారు. పట్టణమంతా భారీ ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎన్నడూ లేని విధంగా పట్టణంలో భక్తులు బంధువుల తాకిడి కూడా పెరిగింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు కూడా దీనిపై సమీక్ష చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించడంతో ఆయా శాఖల పరిధిలో అన్ని చర్యలను తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే తో పాటు దాతలు స్థానిక పెద్దలు పెద్ద ఎత్తున పండగకు ఆర్థిక సహాయాన్ని కూడా చేయడం గమనార్హం. ఇటీవల సాలూరులో అమ్మతల్లి పండుగ దిగ్విజయంగా జరగడంతో పార్వతీపురంలో కూడా ముగ్గురు అమ్మతల్లుల పండగను ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు అధికారులతో , కమిటీ సభ్యులతో మాట్లాడుతూ తగు సూచనలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో పండగ ఘనంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయా శాఖల అధికారులు తెలిపారు.

జనసేన పార్టీ ప్రథమ ప్రాధాన్యత కార్యకర్తల సంక్షేమమే...

జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగబాబు

విశాలాంధ్ర-చింతపల్లి: జనసేన పార్టీ ప్రథమ ప్రాధాన్యత కార్యకర్తల సంక్షేమమేనని ఆ పార్టీ ఎమ్.ఎల్.సి, రాష్ట్ర కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. కారు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన జనసైనికుల కుటుంబాలకు విజయవాడలో సోమవారం చెక్కుల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా చింతపల్లి కి చెందిన కంచర్ల హరికృష్ణ గత ఏడాది తీర్థయాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో విజయవాడ సమీపంలో రహదారి ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మొదటి నుంచి జనసేనాని పవన్ కళ్యాణ్ కు వీరాభిమాని కావడంతో పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు.అధినేత పవన్ కళ్యాణ్ తమ కార్యకర్తల క్షేమం కోసం 500 రూపాయలు కట్టి ఇన్సూరెన్స్ సౌకర్యం పొందితే ఏడాదిలో ప్రమాదవశాత్తు మరణిస్తే 5లక్షల రూపాయలు ప్రమాద భీమా కల్పిస్తూ వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రమాద భద్రత భీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ మరియు పాడేరు ఇన్చార్జి డా.. గంగులయ్య, జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తిల సమక్షంలో హరికృష్ణ సతీమణి జ్యోతికి నాగబాబు చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన సొంత నిధులతో కార్యకర్తల క్షేమం కోసం భీమా పాలసీ ప్రారంభించిన ఏకైక పార్టీ జనసేన అని, మారుమూల కుగ్రామాల కార్యకర్తలు కూడా పవన్ కళ్యాణ్ ని భగవంతునిలా భావిస్తున్నారన్నారు. కంచర్ల హరికృష్ణ కుటుంబాన్ని విజయవాడ ఆహ్వానించి ఐదు లక్షల బీమా చెక్కు నాగబాబు చేతుల మీదుగా అందించడం అభినందనీయం అన్నారు. దీంతో కార్యకర్తల సంక్షేమానికి జనసేన పార్టీలో ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందన్నారు .ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ అధ్యక్షులు గాజుల శ్రీను, హరికృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దూరి. అక్కయ్య పదివీ విరమణ

సీడీపీఓ విజయకుమారి

విశాలాంధ్ర-కొయ్యూరు: దూరి అక్కయ్య వాచ్ మన్ క్యాడర్ లో దాదాపు 42 సంవత్సరాలు రెగ్యులర్ గా 32 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పనిచేసి రిటైర్మ్ అవ్వటం జరిగింది ,కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లో అతని ప్రస్థానం మొదలు అయింది తన కాలపరిమితి అంతా కొయ్యూరు మరియు చింతపల్లి ప్రాజెక్ట్స్ లలో జరిగింది. అతని మాట కటువు అయినా మనస్సు మృదువు, ఎంతో చిత్త శుద్ధి తో వృత్తి నే దైవం గా భావించి ఎంతో మంది ఆఫీసర్ ల మధ్య మంచి పేరు అలాగే పని తనము తెచ్చుకున్న మనిషిగా పేరుపొందారు. వారికి మా స్టాఫ్ తరఫున అంగన్వాడీ కార్యకర్తలు తరఫున ధన్యవాదాలు తెలియచేసాము. చింతపల్లి జీకే వీధి నుండి సీడీపీఓ రమణి, ఏసీడీపీఓ , విజయనగరం నుండి సూపరిండెంట్ సదాశివం, నర్సీపట్నం నుండి శేషు, గోల్కొండ నుండి జెఆర్ సహాయకులు చింతపల్లి నుండి సీనియర్ అసిస్టెంట్, మరియు సూపెర్వైసర్స్ లు హాజరు కావటం అయినది మరియు ముఖ్య అధిదిగా ఎంపీపీ కొయ్యూరు వారు బడుగు రమేష్, ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, టీపీసీ శేఖర్, డిఈఓ భాను కార్యకర్తలు హెల్పర్స్ హాజరు అయ్యారు.

సమస్య విన్నారు...పరిష్కారం చేశారు

విశాలాంధ్ర- పార్వతీపురం: పార్వతిపురం మున్సిపాలిటీ 8వ వార్డులో తక్కువ ఓల్టేజ్ కరెంటు సమస్య కొన్ని సంవత్సరాలుగా ఉన్నప్పటికీ ఎన్నోసార్లు విన్నవించుకున్న ఎవరూ పట్టించుకోలేదని, ఈవిషయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దృష్టికి తీసుకుని వెళ్ళగా వెంటనే స్పందించి వెంటనే ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ తో మాట్లాడి 100 కేవీ ట్రాన్స్ఫార్మర్, అవసరమైన 9 ఎలక్ట్రికల్ స్తంభాలను వెంటనే వేయించారు.వార్డులో కరెంటు 100 కేవీద్వారా సప్లై జరుగుచున్న సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు 8వ వార్డ్ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, వార్డు ప్రజలు తెలిపారు. సమస్య ఎమ్మెల్యేకు చెప్పడమే తరువాయి పరిష్కారం చేసినందుకు ఎమ్మెల్యే తో పాటుఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అమ్మ తల్లి పండగ సందర్భంగా తమకు ఎమ్మెల్యే చేసిన మేలు మరువలేమన్నారు.